# ఉద్దానంలో ఒకరాత్రి

తొలిసారి పగటిపూటంతా తిరిగినా ఉద్దానంలో ప్రత్యేకతేమీ కనిపించలేదు. ఈ పచ్చని పమిటను భద్రంగా కప్పుకున్న పడుచును వెలుగులో చూసి మోహించలేక వెళ్ళిపోతానంటే నా మిత్రుడు ఆ రాత్రి ఆగి సరైన అతిథ్యం తీసుకుంటేగానీ వీల్లేదన్నాడు. ఆకాశం రాత్రిపూటే అందాలను విరజిమ్ముతుంది. అతివ అందం నిశిలో నైట్ క్వీన్‌లా వాసనలు విరజల్లుతుంది. ఏమో? చల్లబడ్డ గాలి ఆ పమిటను జారిస్తే..? ఏ సింగారంతో యే పడుచు ప్రత్యక్షమౌతుందోనన్న ఆశతోనే ఆ రాత్రి ఆగిపోయాను. ఈ యిసిక నేలమీద పడ్డ యే పాదాలముద్రలు నా గుండెలో శాశ్వతముద్ర వేస్తాయోనన్న ఆతృతతో రాత్రి కోసం యెదురు చూసాను. ఆడవాళ్ళు ప్రసాదించే వలపుల్లోనూ కోడిపెట్టలిచ్చే రుచుల్లోనూ తేడాలుంటాయేమో – కోడికూర కొత్తరుచులను అందివ్వటంతో తృప్తిగా తిన్నాను.

రాత్రి యెనిమిదైంది. వజ్రాల నగలతో ఒళ్ళుకప్పుకున్న నల్లని నగ్నసుందరి వడిలో ఆమె ముఖంవేపు చూస్తూనే నిద్దరపోవడానికి నిశ్చయించాను. నా మిత్రుని యింటిప్రక్కనే తూరుపువేపు బయలులో నా మంచం వేసారు. నా చుట్టూ పైకెగసిన కొబ్బరి చెట్లు ప్రణయలేఖలు చదువుతున్నట్లు చప్పుడు చేస్తున్నాయి. భూదేవి భుజానకెత్తుకున్న బిందెలాంటి పనసపండు వాసనే తేనె మారి వూరిస్తోంది.

వస్తారనుకున్న పాటకులు తొమ్మిది దాటినా రాలేదు. ఏ జీడితోటల్లో పనుల్లో నిమగ్నులయ్యారో? తియ్యని ప్రేమగానం వినే అవకాశం కోల్పోయానని విచారిస్తుంటే ఒకాయన దిగబడ్డాడు. సన్నగా వున్నాడు. చుట్ట వెలిగించగానే అతని బొద్దులాంటి పండుమీసాలు కనిపించాయి.

"బాబుకు దుప్పటిచ్చార్రా?" అని కేకవేసాడు. వేసవిలో దుప్పటెందుకన్నాను.

"వేకువఝామున చలేస్తాది బాబూ!"

"ఫరవాలేదు. తర్వాత వేడిగాలి వీస్తుందిగా."

"ఇది ఈ స్థలమహత్యం. ఈ యిసుకలో యేదో పెరిగిందంటే కాస్త అనుమానంతో సుడాలని తమకు తట్టలేదా?"

"ఆ రెండంతస్థులమేడ యీ యిసుకలోనించే లేచిందికదా..." అన్నాను, చుక్కల వెలుగులో దక్షిణవేపున్న మేడనుద్దేశించి.

"వానరుడు మనిషికావటం ఆ సుక్కలు సూసాయేమో? కానీ మనిషి

వానరుడవటం యీ చుట్ట వెలుగులోనే సూసాను. ఈ యిసుకకు మనిషికి భేదమేటి?"

తాత పిడికిడు యిసకతీసి యిలా అంటుంటే నేను సర్దుకుని మౌనంగా మంచంమీద కూర్చొనే అతనివేపు చూసాను.

"ఎలాగా మేడ వూసెత్తావు. మేడలో మనిషిగురించి అడిగావుకాదు."

ఇంతలో ఆ మేడమీద నల్లని కటకటాల మధ్య ఒక మెరుపు మెరిసింది. తాత చెప్పుకుపోతున్నాడు:

"కడుపు మండుతున్న రాజ్యాన కూడుకు కక్కుర్తిపడనోడిని రాజుని సేసినట్టు యీ వూరికి ఆ పరాధీనంకాలేని పరంధామయ్యకి పెద్దరికం యిచ్చాం. కడుపు ఒక గంపని తెలుసు నాయనా! వంకాయలగంపకదా – ఇప్పుడు వంకాయలు కాయలేదు. ఫరవాలేదనుకుంటే అందులో ఆడు సోల్లు నింపుకున్నాడు. పెద్దరికం రాగానే యెదటివాళ్లని మోసం చెయ్యడానికి వంద ఉపాయాలు పన్నాడు. నా కష్టాలు నాను పడుతున్నాను కాబట్టి నా శరీరంకి రోగం లేదు. భూమాత, పొద్దు, చందమామ ఆటి కష్టాలవి పడుతున్నాయి. అన్నాయానికీ అవి యెదిరించినట్టు యీడి అన్నాయానికి నేను యెదురు తిరిగినాను. మనిషికి పరిసరాలెప్పుడూ మంచే చేస్తాయిబాబూ. మనం సక్కగా నడిస్తేనా? పీలమనిషివి – నలుగురి బుర్రలుకొట్టి బొద్దుగా పెరిగి ఆ మేడ కట్టినావు. రబ్బరుగొట్టం పెట్టి వూరోల రొమ్ములో పాలుపిండి నీ ఆస్తిని పెంచుతున్నావు. ఒక మనిషి పాపం తోవల నడిచి పెద్దోడైతే పదిమంది అలాగే పెద్దయిపోదామని పోగవుతారురా? సంగం ఓరుస్తాదని దానికి పంగనామాలు పెట్టబోయావంటే గోతిలో పడ్తావు – వద్దురా అని మొరపెట్టుకున్నాను. ఆ యిచ్చాపురం రోడ్డునించి యీ పచ్చని తివాసీని సూసినట్లుంది. సూసినాడుగానీ దాని అడుగునున్న ముళ్ల కంపలు, యిసుకను దగ్గరుండే సూసినాడుకాదు. అడి మనసు తగ్గలేదు. ఆడు తగ్గలేదు. బుర్ర వక్రించింది. డబ్బు ధనం దుర్దాహం పుట్టిస్తుందికదా... ఏటీవేనోడిమాటలు యెర్రియేదాంతంగా తీసుకుని 'ఒరే తాతా...నివ్వు కలి పురుషుడవనుకుంటున్నావురా' అన్నాడు. అంటే, నాయనా పరంధామయ్యా – అలనాడు రావణాసురు డెట్టిన బాధలకు భూదేవి భరించలేక యెల్లి యిష్ణువుతో మొరపెడ్తే... మనుషులు వానరు లవ్వాల–నేను మనిషై పుట్టాల... అందాక అన్నిబాధలూపడి అణిగివుండమన్నాడు దేముడు. దేనికైనా రోజు రావాలిరా అన్నాను. హిందువుడైనందుకు యిది నమ్మురా అన్నాను, ఆడు యిప్పుడు పెద్దోడైనాడుకదా యినసల్లు సహించడు. గవర్నమెంటు యెవడు? ఎవడెవడు? అంతా యెలకతోక సందం. ఇంట్లో కూకొని డైరీలు రాసుకున్నోళ్ళని వలలో వేసుకున్నాడు. నాయం మండిపోతంటే లాభంలేదని బేళీపెజల్ని ఒకసోట పోగుసేసినాను. ఉన్న మాటంటాను – యెదవల్లార కోపగించుకోకండ్రా అన్నాను. మీనించే ఆడు పెద్దోడైనాడు. మనకి వూతనిస్తాడనుకుంటే ఆడు వూరిపరువంతా లాక్కొని. వూరోలందరినీ అంటే నిన్నూ నన్నూ అందరినీ పనికిమాలినోలని సేసేసినాడు. మనల్ని సరిసీమల్ని సేసి ఆడు తాను పామైపోనాడు. మనం పెట్టుకున్న పుట్టల్ని ఆడు యిరవు సేసుకున్నాడు. ఎన్నాళ్లిలాగ అణిగుంటామ్రా? మీలో మనుషులం అన్న

గర్వం వుంటే తలెత్తండ్రా నాయాళ్లారా! బాబూ...నా మాటలు నా నోటనే వున్నాయి. నేను కత్తులు నూరుతున్నానని నన్ను జైల్లో తొయ్యించాడు. సాక్షం పలికినోలిని కొనుక్కున్నాడు. నాయనా–ఒక దెబ్బ తగిలితే ఏ నరమో తెగాలి. నాయం కత్తిలేని శిచ్చతో జైలుకెల్తే నా నరం తెగిపోతాదా? పెజలకు పనికొచ్చింది చెయ్యకుండా– నాలుగు మాటలాడి, నాలుగు జాగాలు తిరిగి పెద్దొలైనోలకు–ఆ అంబపైత్యాలు వికారించి అల్లనే పొట్టలో పెట్టుకుంటాయి."

తాత మాటలు కొద్దిగా విసుగు పుట్టిస్తున్నాయి. ఇంతలో మేడమీద చిన్నలైటు వెలిగింది. ఆ లేతవెలుగులో నే నెన్నడూ చూడని చక్కదనం ఒక్కసారి సాక్షాత్కరించింది. నా నిట్టూర్పులను పంచుకున్న తాత –

"అదా?" అంటూ మరీ దగ్గరగా జరిగాడు. నేనుకూడా యేంచెప్తాడోనని దగ్గరగా జరిగాను.

"పరంధామయ్య నిజాన్ని అబద్ధంగా మార్చాడు. ఎక్కడలేని తాపత్రయంతో వున్న కోతిరూపాన్ని కొండముచ్చు రూపంగా మార్చుకున్నాడు. పెళ్ళాం వుండాలన్న కోరిక కాస్త వయసు ముదిరాక వచ్చింది. అప్పుడు ఏం చేసాడో తెలుసా? మోసం...మోసం.." అంటూ నా చెవిదగ్గర జరిగిన విషయం చెప్పాడు. అది చెప్పాక మళ్లీ ఉత్కంఠతో, "బాబూ... ఇక్కడ యిలాంటి ఘోరాలు జరుగుతున్నాయంటే యీ స్థలపురాణం కాసింత తెలియాలి," అన్నాడు.

మళ్ళీ ఆ అపరూప సుందరి ఆకారం కనిపిస్తుందేమోనని రెప్పలు వాల్చని కళ్ళతో అటే చూస్తుంటే తాత చెప్పుకపోతున్నాడు –

"దగాచేసిన యోధుల్ని ఓడ యెక్కించాడు రాజు – నడిసముంద్రాన ముంచమని! ఓడ పెద్ద కనికరంతో వాళ్ళు కళింగపట్నం రేవులో దిగి యీ యిసుకను నందనవనం చేసారు. ఈ ఉద్యానవనం ఉద్దానం అయ్యింది. అయితే ఆ యోధులు బుగ్గయినా వాళ్ల దగా బుగ్గికాలేదు బాబూ...తరతరాలకు చుట్టి వస్తోంది."

అంతగా ఆసక్తి పుట్టించిన తాత మాటలు నా కిప్పుడు విసుగు పుట్టిస్తున్నాయ్. ఒంటరిగా వుండాలనుకుంటున్నానని పోల్చుకున్నాడేమో తినొస్తానని పోయాడు. మంచంమీద చేరబడి అలా యెంతసేపో ఆ మేడవేపే చూస్తున్నాను. వైరివికారంలేని చల్లనిగాలి వీస్తోంది. మధురమైన సంగీతాన్ని అందిచ్చే రీడ్సులా కొబ్బరికమ్మలు కదలుతున్నాయి. చుక్కలు కదలుతున్నట్లు భ్రమ పుట్టిస్తున్నయ్. నా ఆలోచనలు మెరుస్తున్న చుక్కలతోరణాలై కదలుతున్నాయ్.

రాత్రి... పేరుకుంటున్న కారుచీకటి. ముంగురులను ముందుకు జార్చి, బరువైన వాలుకనులతో చూస్తున్న ముగ్ధలా వుంది ప్రకృతి. నా మనసు నిత్యక్రీడతో అమృతమైపోయింది. అలాంటప్పుడు నింగిలో తేలిపోతున్న చంద్రబింబంలా చిరునగవుతో ఆ మేడనించి ఆమె దిగివచ్చింది. వెన్నెలను మోసుకుని వచ్చి నా మంచందగ్గర చూపులనే తియ్యని కంఠంచేసి నిల్చుంది. ఆమెను ముట్టుకోడానికి నాకు శక్తిలేదు. గజ్జల రవళులేమో అనుకుంటే – అంతదూరాన హోరుమనే బంగాళాఖాతపు ఆరాటం. చిత్రవిచిత్రభావాల బదులు నా గుండెను అఖాతంచేసిన ఆమె సౌందర్యం. అక్కడే చెట్టునున్న తేనెను కారుస్తున్న పనస పండునించి తొనలుతీసి

నా నోటికి అందిచ్చింది. ఆమె రొమ్ముమన దాగిన రుచికోసం తహతహలాడాను. ఇంకా కదలవా అన్నట్లు నాలుగడుగులు ముందుకు వేసింది. వెంటపడ్డాను. ఎంతవడిగా నడుస్తున్నా ఆమెకూ నాకూ మధ్య దూరం తగ్గలేదు. రసాల మామిడి చెట్టెక్కి నాకంటికి కనబడలేదు.

ఒక తెల్లమబ్బు నలుపెక్కి గర్జించింది. కొమ్మనించి కోకిల అరుస్తోంది. చెట్టుక్రింద వేచివుంటే పండుతో ప్రక్కనే గెంతింది. తిను అన్నట్లు ఆ తియ్యని అరముగ్గిన పండుని మీదవేసింది. ఒకసారి నోటిదగ్గర పెట్టాను. రుచిలేదన్నట్లు పారేసాను. ఊరకే చెలియించే లేడికళ్లుకావామెవి. ఆమె దరహాసం వెనుక గంభీరత గోచరించింది. నా అందంతో మైకంలో పడ్డ నివ్వు, నా విశాలమైన హృదయం యేంచూడగలవని–ఆమె కదలిక వదలిన గీంకారం సవాలుచేస్తోంది.

అపురూపమైన ఆడదాన్ని సంతృప్తి పరచగలిగానన్న గర్వం మగాడికి అపూర్వాను భూతిని కలుగజేస్తుంది. అలా అనుకోగానే నా కాళ్లు తేలిపోలేదు. నా హృదయస్పందన నిదానంగా పోతోంది. పైనించి కొబ్బరికాయలు దబదబ నా దగ్గరలో రాలాయి. చెట్టుదిగి ఒక కొబ్బరికాయ నా చేతికి అందిచ్చింది. నువ్వు తాగితేగాని నేను తాగనన్నాను. నా బలవంతం ఆమెకు నచ్చిందేమో తాగింది. నేనెంతో దగ్గరగా కదులుతున్నానిప్పుడు. ఇంతవరకు నన్ను ఒక దృష్టితో చూసి, యిప్పుడు యింకో దృష్టితో చూస్తోందనిపించింది. జీడి తోటల్లో ఉడతలు, బల్లులు యెదురౌతున్నాయ్. రాలిన ఆకులు, పళ్ళు, పిక్కలు మట్టుకుంటూ ఒక కొబ్బరిచెట్టుముందు ఆగింది. చెట్టు అడుగున తొండంలో తొర్రవుంది. కొమ్మలు సగం రాల్చిన చెట్టు. ఆ తొర్రలో చెయ్యిపెట్టి తేనెపట్టు తీసింది. ఆ తేనె చేతికి రాసుకుని తేనెటీగలు కరవకుండా చేసుకుంది. నోరు ఆవలించమని సైగచేసి నా నోటిలో ఆ తేనెపట్టును పిండింది.

తేనెటీగలు నన్ను వెంటతరిమాయి. పరుగెత్తాను. టపటప శబ్దం. ఎక్కడా అదే శబ్దం. భూదేవి పొట్టపగిలి కర్రపెండలం బయటపడ్తోంది. ఇసుక నేలంతా పచ్చని తివాసీని పరుచుకుంది. ఆ పచ్చదనంలో ఒకమూల అడవి పూవులా దాగుందేమోనని తోటతోటలూ, కామబాధను మూగబాధగా చేసుకుని గాలించాను.

దూరంనుంచి ప్రేమపిలుపు. దగ్గరనించి పకపక నగవు. ప్రక్కనించి గిలిగింతలు. మోహాన్ని చీరచెంగులా వదలివేసింది. పచ్చని శయ్యపై వజ్రాల్లా మెరిసేకళ్ళు, కళ్లాల్లా లాగుతుంటే అటువేపే వెళ్లాను. మునగ చెట్టుక్రింద జామికాయ నములుతూ నిల్చుంది. నే నేనాడూ వూహించని అందం ఆమెది. ఏ ముఖంలో నేనెప్పుడూ తిలకించని అందం ఆమెది. ఏ చేయీ యింత తీయని తేనెను నా నోట పిండలేదు. దగ్గరగా జరిగాను. ఆమె కదలి వెన్నెలలో ప్రవేశించింది. ఒక్కసారి నేను కాంక్షించిన పనే చేసింది. పమిటచెంగు జార్చింది. అంతేకాదు. మరుక్షణంలో దేదీప్యమానంగా వెలిగిపోతూ నగ్నంగా నాయెదరగా నిల్చింది. ఆమె పెదాలు తేనె పనసతొనలు. తాటిముంజల్లాంటి కళ్లు ఆమెవి. జీడిపలుకుల్లాంటి పళ్ళవరస. అరముగ్గిన రసాల మామిడిపళ్ళలాంటి వక్షం. తొక్కతీసిన కర్రపెండలంలా నునుపైన కాళ్ళుచేతులు... ఓ క్షణం నివ్వెరపోయి నిల్చుండిపోయాను. ఈ పూలగుత్తి నాది. ఆవేశంతో అల్లకల్లోలమైపోయి రెప్పపాటులో, అందాన్నంతా విప్పారినిల్చున్న ఆమెను గట్టిగా కౌగలించుకోబోయాను.

తొలిసారి ఆమె మాటాడింది.

"నన్ను ముట్టుకోకు" అంది నాలుగడగులు వెనుకకు వేస్తూ. ఇంకా దగ్గరై మీద పడబోయాను.

"నేను నీ ఒక్కరి సొత్తునూ కాను."

"నివ్వు నాదానివే...నా సర్వస్వానివి" అంటూ అలాపనచేస్తూ మీదపడ్డాను. నా గుండెల్లో చప్పున ఒక బాకు గుచ్చుకుంది. రక్తం చివ్వున త్రుళ్ళింది.

గాబరాగా నిద్రనుండి లేచి కూర్చుండిపోయాను. నా ప్రక్కనే ఒకవేపు తాత పడుకున్నాడు. ఇంకో ప్రక్క నా మిత్రుడు పడుకున్నాడు. తాత చెప్పినట్లే చలివేస్తోంది. ఆకాశంలో క్షీణచంద్రుడు ఆ మేడ యింటిమీద వెలుగుతున్నాడు. ఎదురుచుక్క వికసించిన పువ్వులా తూరుపున వెలుగుతోంది. చిన్న చిన్న మేఘాలు దక్షిణగాలితో కదలి చందమామను కప్పడానికి వస్తున్నాయి.

తాత లేచి చుట్టముట్టించాడు.

"లేచికూర్చున్నావు- కలగాని కన్నావా?" అన్నాడు.

"అవును."

"ఆడదాని గుండెను అంకించుకోవటం అంత సులువా బాబూ...మోజుపడ్తున్నావు గానీ... ఆ మేడలోని చుక్క నీకూ దక్కదు ఆ పరంధామయ్యకూ దక్కదు."

పెద్ద నిట్టూర్చి "ఇది అందరి లక్ష్మి. ఏ ఒక్కరికీ యెందుకు దక్కాలీ?" అన్నా.

తూరుపు తెలతెలవారుతోంది. తాతలేచి ప్రక్కనున్న కత్తిదొనెను తీసుకుని జీడితోటలవేపు వెళ్ళిపోయాడు.

(యువ - దీపావళి సంచిక - నవంబరు, *1974*)

⁂ ⁂ ⁂